సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



నృసింహుని సన్నిధిలో రద్దీ

సారంగాపూర్ : బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు గురువారం భక్తులు పోటెత్తారు. శుక్రవారం జాతర నిర్వహిస్తారు.



క్వింటాల్ పత్తి రూ.7,700

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాల్‌కు రూ.7,700 పలికింది. గురువారం 116 వాహనాల్లో 1459 క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. స్వల్ప గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

ముస్తాబాద్(సిరిసిల్ల): నాలుగు రోజులుగా నల్లా నీళ్లు వస్తలేవు.. స్నానాలు కూడా చేయడం లేదంటూ ముస్తాబాద్ కేసీఆర్‌కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో గురువారం ధర్నా చేపట్టారు. మహిళలు మాట్లాడుతూ ఆరు నెలలుగా కేసీఆర్‌కాలనీలో నీటి ఎద్దడి ఉందన్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ఉన్న బోరింగ్ నుంచి నీళ్ల బిందెలతో మొదటి, రెండో అంతస్తు ఎక్కడం కష్టంగా మారిందని వాపోయారు. నీళ్లు లేక ఏ పనులు చేసుకోలేకపోతున్నామన్నారు. ఈ విషయంపై కార్యదర్శి రాజు మాట్లాడుతూ పైపులైన్ లీకేజీతో నీటి సరఫరా నిలిచిపోయిందని, సంపు వద్ద స్టార్టర్ పాడయిందన్నారు. సుతారి భాగ్యలక్ష్మి, చింతోజు విజయ, కొత్తపల్లి కనకవ్వ, ఆవునూరి సంపూర్ణ, ఎల్లండి సునంద పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో



నిమ్మపల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

కోనరావుపేట(వేములవాడ): విద్యాసంస్థల సమయానికి బస్సులు రావడం లేదంటూ నిమ్మపల్లిలో విద్యార్థులు గురువారం రోడ్డుపై బైఠాయించారు. విద్యార్థులు మాట్లాడుతూ నిమ్మపల్లి నుంచి సుమారు 100 మంది విద్యార్థులు కోనరావుపేటలోని కాలేజీ, మోడల్‌స్కూల్, సిరిసిల్ల కాలేజీలకు వెళ్తున్నారన్నారు. ఉదయం, సాయంత్రం విద్యాసంస్థల సమయంలో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కాంగ్రెస్ నాయకులు నాగండ్ల భూమేశ్, బండ సత్తయ్య, గౌరు బక్కయ్య, ఏబీవీపీ మండల కన్వీనర్ పూజం కార్తీక్ మద్దతు ప్రకటించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ ఉమామహేశ్వరి

సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో సర్దాపూర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్రీడలు, లలితకళలు, సాంస్కృతిక పోటీలలో పాల్గొని బహుమతులు గెలుపొందారు. అథ్లెటిక్స్ బాలుర విభాగంలో శివసాయి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడు. కళాశాల అసోసియేట్ డీన్ ఉమామహేశ్వరి, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

జిల్లాలో 4,058 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగులో భాగంగా గురువారం 4,058 మందికి కంటిపరీక్షలు చేశారు. జిల్లాలోని 26 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించారు. 667 మందికి రీడింగ్ కంటి అద్దాలను పంపిణీ చేశారు. 461 మందికి పాయింట్ అద్దాలను పంపిణీ చేశారు. 234 మంది సిబ్బంది కంటి వెలుగు శిబిరాల్లో సేవలందించారు.

నిబంధనలు పాటించాలి



సిరిసిల్ల ఆస్పత్రుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సూచించింది. సిరిసిల్లలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో గురువారం టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు చేపట్టింది. నిబంధనలు పాటించని ఆస్పత్రుల యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో కమిటీ సభ్యులు వైద్యులు సంతోష్, చింతోజు భాస్కర్, జలపతి, బాలయ్య ఉన్నారు.

గల్లీ పోరలు .. గంజాయి ప్రియులు!

యువతకు పార్ట్ టైం జాబ్‌గా మారిన గంజాయి సరఫరా

'ఇటీవల కరీంనగర్ తెలంగాణ చౌక్ సమీపంలోని వీధుల్లో గంజాయి విక్రయిస్తున్న ఓ హాస్టల్‌కు చెందిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వారి గదుల నుంచి కిలో గంజాయి, కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అందులో చిన్న గ్రైండర్, వెయింగ్ మెషిన్, సిగరెట్ పేపర్, ప్యాకింగ్ పేపర్ తదితరాలు లభ్యమయ్యాయి. వాటిని చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసిన గంజాయిని గ్రాముల్లోకి మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి పంపారు. అందులో రిపీటెడ్ అఫెండర్స్ (పదే పదే నేరాలు చేసేవారు)ని మాత్రం రిమాండ్‌కు తరలించారు.'

- కరీంనగర్ పాతబజార్‌లో దాదాపు 20 మందికిపైగా డ్రగ్స్ పెడ్లర్లు
- పాకెట్‌మనీ కోసం విద్యార్థుల అడ్డదారులు
- జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో చాపకింద నీరులా దందా
- సోషల్ మీడియా వేదికగా గంజాయి కొంటున్న యువత
- ఉత్తరాంధ్ర, భద్రాచలం నుంచి కిలోల కొద్దీ అక్రమ రవాణా
- ప్రైవేటు హాస్టళ్ల గదుల్లోనే గంజాయి ప్యాకింగ్
- యంత్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకుంటున్న వైనం



జగిత్యాలలో పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)





పాతబజార్‌లో అనుమానాస్పద యువకులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సాధారణంగా ఒకప్పుడు గంజాయిని ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు ఉత్తరాది నుంచి తీసుకువచ్చేవారు. కానీ, కరోనా తరువాత వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఫలితంగా భద్రాచలం, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంధ్ర ఏజెన్సీ ఏరియాల్లో గంజాయి సాగు పెరిగింది. ఈ పరిణామం రెండు రాష్ట్రాల్లో గంజాయి అక్రమ రవాణా పెరుగుదలకు కారణమైంది. దీన్ని వినియోగించుకుని అనతికాలంలో ఎదిగేందుకు కరీంనగర్ పాతబజార్ ఏరియాలోని కొందరు యువకులు సిద్ధపడ్డారు. ఒకరిని చూసి ఒకరు దాదాపు 20 మంది వరకు ఇక్కడ పెడ్లర్లుగా మారినట్లు సమాచారం. వీరంతా భద్రాచలం ఏరియా నుంచి ఐదారు కిలోల వరకు బైకుల మీద వెళ్లి కొంటారు. కిలోకు రూ.మూడు వేల వరకు వెచ్చించి.. తరువాత వాటిని 50 గ్రాముల పాకెట్లలోకి మార్చి రూ.300 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. ఒకసారి సరుకు తీసుకొచ్చి.. నెలలో రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. వీరు తయారు చేసే సిగరెట్లకు ఇక్కడ బాగా డిమాండ్ ఉంది. సాధారణంగా మెట్రో నగరాల్లో హషీష్ (గంజాయి నుంచి తీసే నూనె)ను సిగరెట్లలో నింపి వాడతారు. కానీ.. ఇక్కడ విద్యార్థులు ప్రత్యేక పేపర్‌తో సిగరెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.

2022లో నమోదైన గంజాయి కేసులు

జిల్లా	కేసులు	పట్టుబడిన గంజాయి	నిందితుల సంఖ్య
కరీంనగర్	22	33.919 కిలోలు	59
సిరిసిల్ల	15	3.509కిలోలు	51
జగిత్యాల	11	17.620కిలోలు	32
రామగుండం	13	8.32 కిలోలు	20



గ్రైండర్



వెయింగ్ మెషిన్





గంజాయ్ పొట్లాలు, గమ్‌పేపర్స్

విలాసాల కోసమే.. అడ్డదారులు..!

నగరంలో గంజాయి సరఫరా చేసే యువకుడు ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించినప్పుడు తనకు గంజాయి అలవాటు లేదని.. కేవలం స్మార్ట్ ఫోన్ మెయింటనెన్స్.. తన గర్ల్‌ఫ్రెండ్‌ను బైకు మీద తిప్పేందుకు పాకెట్ మనీ కోసం ఇలా చేశానని.. ఇంకెప్పుడూ ఇలా చేయనని కాళ్లావేళ్లా పడటం చూసి పోలీసులు అవాక్కయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు, కొందరు డ్రైవర్లు కూడా ఇదే బాటపట్టారు. కేవలం తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించవచ్చన్న కారణంతోనే వీరంతా ఇలా గంజాయి స్మగ్లర్ల అవతారమెత్తుతున్నారని పోలీసులే చెబుతున్నారు.

- పాత బజార్‌తోపాటు, కొందరు విద్యార్థులు బైకుల మీదనే వరంగల్ మీదుగా భద్రాచలం వెళ్లి సరుకు తెస్తున్నారని సమాచారం. తిరిగి వచ్చాక.. హాస్టల్ గదుల్లో తమ వద్ద ఉన్న గ్రైండర్‌తో గంజాయి ఆకులను నూరుతున్నారు. ఆ చూర్ణాన్ని వెయింగ్ మెషిన్‌తో 50 లేదా 100 గ్రాముల ప్యాకెట్లలో నింపుతారు. అనంతరం గమ్‌పేపర్లతో సిగరెట్లుగా చుడుతున్నారు.
- వీరు వాడే గ్రైండర్, గమ్‌పేపర్, వెయింగ్ మెషిన్ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేసుకున్నట్లు తెలుసుకున్న పోలీసులు ముక్కున వేలేసుకున్నారు.
- గంజాయి విక్రయం అంత ఆషామాషీ కాదు. కేవలం నమ్మకస్తులకే అమ్మాల్సి ఉంటుంది. అందుకే అమ్మే ముందు ఇన్‌స్టా, వాట్సాప్ ద్వారా లోకేషన్లు షేర్ చేసుకుంటున్నారు.
- కరీంనగర్ ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. ఇక్కడ అనేక ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి. కోచింగ్ సెంటర్లతో యువత నిరంతరం హాస్టళ్లలో ఉంటున్నారు. వీరందరినీ పాత బజార్‌కు చెందిన పెడ్లర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు.
- పాత బజార్ ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే.. గంజాయి కొనేందుకు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల నుంచి విద్యార్థులు వీరిని ఆశ్రయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వీరితోపాటు గంజాయి పెడ్లర్లుగా మారిన వారిలో జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి నుంచి ఉన్నత విద్యకోసం వచ్చిన విద్యార్థులు కూడా ఉండటం గమనార్హం.
- జగిత్యాల, పెద్దపల్లి నుంచి కూడా పెద్ద ఎత్తున గంజాయి రవాణా జరుగుతోంది. గతవారం జగిత్యాలలో పోలీసులు అంబులెన్స్‌లో రాజస్థాన్‌కు తరలిస్తున్న 70 కిలోల గంజాయిని పట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక చత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలకు సమీపంలో ఉన్న రామగుండం కమిషనరేట్ లోనూ గంజాయి గుప్పుమంటూనే ఉంది. ఇతర రాష్ట్రాల కూలీల ద్వారా రామగుండంలోకి వస్తున్నప్పటికీ... స్థానికులు కూడా వ్యసనానికి బానిసవడం ఆందోళన కలిగిస్తోంది.

గంజాయిపై ఉక్కుపాదం



నగరంలో గంజాయి విక్రయించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల వారీగా విక్రయదారులను గుర్తించి, నిరంతరం నిఘా పెడుతున్నాం. కమిషనరేట్ పరిధిలో గంజాయి విక్రయించినా, సేవించినా కేసులు నమోదు చేస్తాం. అంతేకాకుండా విద్యాసంస్థలతో కలిసి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నాం. ఇలాంటి కేసుల్లో ఇరుక్కుంటే ప్రైవేటు జాబులు కూడా రావన్న సంగతి విద్యార్థులు గుర్తించాలి.

– సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

మనిషి మృగమైపోతాడు



గంజాయికి అలవాటు పడినవారు మృగాలవుతారు. మెదడులో అనేక మార్పులు వస్తాయి. గంజాయి కోసం తహతహలాడతారు. గంజాయి కొనేందుకు చోరీలు, నేరాలకు పాల్పడతారు. వారికి వావీవరసలు ఉండవు. ఆడవాళ్లు ఒంటరిగా దొరికితే ఎలాంటి అఘాయిత్యానికైనా పాల్పడతారు. హింసాత్మక ప్రవృత్తి పెరిగిపోతుంది. దాడులు చేసేందుకు వెనకాడరు. తల్లిదండ్రుల ప్రవర్తనలో తేడాలు కనిపిస్తే.. వెంటనే అప్రమత్తమవాలి. హాస్టళ్లలో చదువుకునే పిల్లలపైనా ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచాలి. మెమొరీలాస్, నిద్రలేమీ, అంతర్గత అవయవాలు దెబ్బతిని త్వరగా మరణిస్తారు. – డాక్టర్ వీరేందర్, సైకాలజిస్ట్

మహాజాతరను విజయవంతం చేద్దాం

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- పటిష్ట బందోబస్తు : ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ: జిల్లా పేరును నిలబెట్టేలా.. రాజన్నసిరిసిల్ల జిల్లాలోనే అతిపెద్ద జాతర అయిన మహాశివరాత్రి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో గుడి ఓపెన్‌స్లాబ్‌లో గురువారం సమీక్షించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. పార్కింగ్, రోడ్ల మరమ్మతులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, బందోబస్తు, పారిశుద్ధ్యం నిర్వహణ, శివార్చన, సూచికల బోర్డుల ఏర్పాటు, ప్రచారం, అనుబంధ ఆలయాల్లో ఏర్పాట్లపై చర్చించారు.

- భక్తులు ఇబ్బందులు పడకుండా కంట్రోల్‌రూమ్ ఏర్పాటుతో ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందన్నారు. తమ శాఖలకు సంబంధించిన బాధ్యుల వివరాలను ఆలయ అధికారులకు అందజేయాలని సూచించారు. భక్తులకు సహాయం అందించేందుకు వీలుగా ×మే ఐ హెల్ప్ యూ× సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సెంటర్లను జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షిస్తారన్నారు.
- వేములవాడలో జాతర జరిగే మూడు రోజులు మూడు షిఫ్టులలో పారిశుద్ధ్యం పనులు జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు.
- భక్తులు ఇబ్బందుల పడకుండా ఉండేందుకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, ప్రదేశాలలో శాశ్వత ప్రాతిపదికన రేడియం స్టిక్కర్స్‌తో కూడిన సైన్‌బోర్డును ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఆలయ పరిసరాలలో ఈవో ఏర్పాటు చేయాలన్నారు.
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మూడు షిఫ్టులలో పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. బస్తీ దవాఖానాను శివరాత్రికి ముందే ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్, ఆలయ అధికారులకు సూచించారు.
- రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు త్వరగా పూర్తి చేయాలని రోడ్లు, భవనాలశాఖ అధికారులకు ఆదేశించారు.
- నాంపల్లిగుట్టపై గల స్టెప్‌వెల్స్ క్వాలిటీని మెరుగుపరిచి వాడుకలోకి తేవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు, బస్టాండ్‌ల వద్ద తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు.
- శివరాత్రి జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. గతం కంటే ఎక్కువ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.
- వేములవాడకు వచ్చే భక్తులకు జాతరకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే గూగుల్‌ప్లేస్టోర్‌లో అందుబాటులోకి తెస్తామన్నారు.
- ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు, సెస్ ఎండీ రామకృష్ణ, డీపీవో రవీందర్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా సెస్ ప్రతినిధుల ఎన్నిక

- ఓటర్లకు తాయిలాలు



సుద్దాలలో ఓటు వేసేందుకు క్యూకట్టిన ఓటర్లు

కోనరావుపేట(వేములవాడ): సిరిసిల్ల విద్యుత్ సరఫరా సంస్థ(సెస్) గ్రామ ప్రతినిధుల ఎన్నిక స్థానిక సంస్థల ఎన్నికలను తలపించింది. మండలంలోని సుద్దాల గ్రామంలో గురువారం సెస్ ప్రతినిధుల ఎన్నిక నిర్వహించారు. సభ్యుల స్థానాలకు పోటీ పెరగడంతో పోలింగ్ నిర్వహించారు. సుద్దాల గ్రామ సెస్ ప్రతినిధుల ఎన్నిక కోసం సుంకరి రెడ్డి, కటికె రాజయ్య, ఎరవెల్లి కిషన్, వంగాల భూమేశ్ పోటీపడ్డారు. ఎరవెల్లి కిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన ఒక్క స్థానానికి ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. దీంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలో వంగాల భూమేశ్‌కు 73 ఓట్లు, సుంకరి రెడ్డికి 54, కుంటెల్లి రాజయ్యకు 45 ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు సాధించిన వంగాల భూమేశ్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఓటింగ్‌కు రెండు రోజుల ముందు నుంచే ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు మందుపార్టీలు ఇచ్చినట్లు సమాచారం.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి
- బోయినపల్లి పీఎస్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్



బోయినపల్లి పీఎస్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి(చొప్పదండి): ప్రజలకు మెరుగైన సేవలు అందించమే పోలీస్‌శాఖ లక్ష్యమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, ఎస్ఎస్ అమలుతీరు, ఫంక్షనల్ వర్టికల్స్, కోర్టు డ్యూటీ, బ్లూకోల్ట్, పెట్రోల్, మొబైల్, బైక్ టీమ్స్ పనితీరును పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండాలని, సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరారు. 100 డయల్ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐ బన్సీలాల్, ఎస్సై అభిలాశ్ ఉన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- రాష్ట్రంలో క్రీడలకు సర్కారు ప్రాధాన్యత
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



మినీస్టేడియంలో క్రీడాకారులతో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్లటౌన్: గ్రామీణ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్లలోని రాజీవ్‌నగర్ మినీస్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించే వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ ప్రీమియం లీగ్ పోటీలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు దేహధారుడ్యాన్ని, మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాలు వెలికితీసేలా సర్కారు పెద్దపీట వేస్తుందన్నారు. ఈమేరకు జిల్లాలోని 255 గ్రామాల్లో క్రీడాప్రగతి ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఉపేంద్రరావు, కౌన్సిలర్లు రాపెల్లి అరుణ పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో కంటివెలుగు



పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా జడ్జి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల జిల్లా కోర్టులో గురువారం కంటివెలుగు నిర్వహించారు. కోర్టుహాలులో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా జడ్జి ప్రేమలత ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కంటి వైద్యపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయమూర్తులు శ్రీలేఖ, సౌజన్య, న్యాయవాదులు, సిబ్బంది 151 మందికి పరీక్షలు చేయించుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, న్యాయసేవా సమితి మెంబర్ చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతం పాల్గొన్నారు.



పోతిరెడ్డిపల్లెకు బస్సు వచ్చిందోచ్..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని మారుమూల పల్లె పోతిరెడ్డిపల్లెకు ఆర్టీసీ బస్సు వచ్చింది. ఇటీవల గ్రామంలో పర్యటించిన మంత్రి కేటీఆర్ దృష్టికి బస్సు రావడం లేదని విద్యార్థులు, గ్రామస్తులు తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు వేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి సర్పంచ్ లక్ష్మణ్‌రావు గురువారం బస్సును ప్రారంభించారు. ఉపసర్పంచ్ వెంకయ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

సిరిసిల్లఅర్బన్: అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ తరలివెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాకు వెళ్తున్న సీపీఎం నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, ఎలగేటి రాజశేఖర్‌ను అరెస్టు చేయడం సరికాదన్నారు. సమావేశంలో మోర అజయ్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

అసైన్డ్ భూములలో నిర్మాణాలపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో అసైన్డ్ భూములలో ఆక్రమం అక్రమంగా నిర్మించారని గ్రామానికి చెందిన సంగెం బాలయ్య, సంగెం కనకవ్వ, నోముల రజిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మంత్రి కేటీఆర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ పేరిటా ఉన్న పట్టా భూములలో ఆక్రమ నిర్మాణాలు చేపట్టారని అటవీ, రెవెన్యూ అధికారులకు గతంలో ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైన ఈ భూములపై సర్వేచేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్‌స్కూల్ బస్సుల తనిఖీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని ప్రైవేట్ స్కూల్ బస్సులను సిరిసిల్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రారెడ్డి గురువారం తనిఖీ చేశారు. మండలంలోని విజ్ఞాన్, జ్ఞానదీప్, శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్ల బస్సుల ఫిట్‌నెస్, రోడ్డు ట్యాక్సీ, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. 15 ఏళ్లు దాటిన స్కూల్ బస్సులను స్క్రాప్ చేయాలని సూచించారు. విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ లతీఫ్, శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రియాంక, జ్ఞాన్‌దీప్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ ఐలేశ్ ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి పరారీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన బండారి దుర్గయ్య(50) సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం పరారీ అయ్యాడని కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయిన దుర్గయ్యను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగానే ఫిట్స్ వచ్చాయని కుటుంబీకులు తెలిపారు. తీవ్ర అనారోగ్యానికి గురైన దుర్గయ్య చికిత్సకు సహకరించకుండా.. కళ్లు కప్పి పారిపోయాడన్నారు. ఆయన కోసం సిద్దిపేట, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటల్లో గాలించిన ఆచూకీ దొరకలేదని దుర్గయ్య సోదరుడు బండారి బాల్‌రెడ్డి తెలిపారు. దుర్గయ్య ఆచూకీ తెలిసిన వారు 8309043607కు సమాచారం అందించాలని కోరారు.

వంతెనలు లేక పరేషాన్

- చిన్నపాటి వరదలకే నిలుస్తున్న రాకపోకలు
- తాత్కాలిక మరమ్మతులతోనే సరి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బ్రిడ్జీలు నిర్మించాలని వేడుకోలు

“ఈ చిత్రంలో కనిపిస్తున్న మార్గం.. రుద్రంగి మండలంలోని కొచ్చగుట్టతండా, అంబారిపేటతండాకు వెళ్లే ప్రధాన రహదారి. ఏటా వర్షాకాలంలో వరదలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. రుద్రంగి నుంచి తండాలకు వెళ్లేందుకు తండావాసులు ఇబ్బందులు పడుతుంటారు. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.”





“ఇది తుర్తి, కొత్తపేట నుంచి రుద్రంగికి వెళ్లే ప్రధాన రహదారి. ఈ దారికూడా చిన్నపాటి వరదకే కోసుకుపోయి రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఇక్కడ వంతెన నిర్మిస్తే మూడు గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతాయి. ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా.. ఆందోళనలు చేపట్టిన పట్టించుకునే వారు కరువయ్యారు.”

రుద్రంగి(వేములవాడ): మారుమూల అటవీప్రాంతమైన రుద్రంగి మండలంలోని పంచాయతీ రోడ్లపై వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు కోసుకుపోతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని కొచ్చగుట్టతండా, అంబారిపేట తండాలు, మారుమూల అటవీ ప్రాంతాలైన కొత్తపేట, తుర్తి గ్రామాలపై పట్టింపు లేదు. రెండు గ్రామాల ప్రజలు ఏ పనికైన రుద్రంగికి రావాల్సిందే. చిన్నపాటి వర్షానికే దారులు కొట్టుకుపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వరదలో నుంచి వాగు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

స్పందన కరువు



ఏటా వర్షాకాలం చిన్నపాటి వరదకే దారి కోసుకుపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మించాలని చాలా సార్లు విన్నవించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. మా కొత్తపేట, తుర్తి గ్రామాల ప్రజలకు రుద్రంగికి రానిదే రోజు గడవదు. ఏ అవసరానికైన రుద్రంగికి రావాల్సిందే. బ్రిడ్జి నిర్మిస్తే మా కష్టాలు దూరమవుతాయి.

– పిట్టల శంకర్, కొత్తపేట

ప్రమాదాలు జరుగుతున్నాయి



అత్యవసర సమయాల్లో వరద దాటుతుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. మా తండాల్లో వైద్యసేవలు కూడా దొరకవు. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే మా కష్టాలు తీరుతాయి. సూరమ్మ ప్రాజెక్టులో దారి మునుగుతది అంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి, వంతెన నిర్మించాలి.

– గుగులోతు పూల్‌సింగ్, కొచ్చగుట్టతండా

త్వరలోనే నిర్మిస్తాం



రుద్రంగి, తుర్తి, కొత్తపేట గ్రామాల మధ్య గల దారిలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే బ్రిడ్జి నిర్మిస్తాం. కొచ్చగుట్ట, అంబారిపేటతండాలకు ఇప్పుడు వెళ్లే దారి సూమర్మ ప్రాజెక్టు ముంపు ప్రాంతం. అక్కడ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు లేవు.

– మనోహర్, పీఆర్, ఏఈ, రుద్రంగి

సబ్‌కోర్టు లోక్‌అదాలత్ మెంబర్ల నియామకం


నేరెళ్ల తిరుమల్‌గౌడ్


పొత్తూరి అనిల్‌కుమార్

వేములవాడ: వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లోక్‌అదాలత్ మెంబర్లుగా సీనియర్ అడ్వకేట్లు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, పొత్తూరి అనిల్‌కుమార్‌లను జడ్జి సత్తు రవీందర్ గురువారం నియమించారు. జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాల్లో వీరు పాల్గొననున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఏడుగురి పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.40,250 నగదు సీజ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని ఓ ఇంటిలో తీన్‌పత్తా ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు పట్టుబడగా వారి నుంచి రూ.40,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

సరస్వతీ నిలయం.. సమస్యల వలయం

- అర్ధంతరంగా నిలిచిన వంటగది
- ఉపయోగంలోని లేని మూత్రశాలలు
- తుర్కాషినగర్ స్కూల్‌పై పట్టింపు కరువు


నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



ఇది వేములవాడరూరల్ మండలంలోని తుర్కాషినగర్ ప్రభుత్వ పాఠశాలలోని వంటగది. కొన్ని నెలల క్రితం ఓ కాంట్రాక్టర్ ఈ పాఠశాలలో పనులు చేశారు. అయితే కొన్ని పనులు పూర్తికాకుండానే బిల్లులు మాత్రం తీసుకున్నాడు. కానీ వంటగది, మూత్రశాలలు పూర్తి చేయలేదు.

వేములవాడరూరల్: ఆ గ్రామం పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆదర్శంగా నిలిచింది. అయితే ఏంటి సమస్యల పరిష్కరించుకోవడంలో వెనుకపడే ఉంది. గ్రామంలోకి వచ్చే రోడ్డు సరిగ్గా లేదు. గ్రామంలోని పిల్లలు చదువుకునే పాఠశాలలో అన్నీ సమస్యలే. వేములవాడరూరల్ మండలంలోని తుర్కాషినగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సమస్యలే రాజ్యమేలుతున్నాయి. వేములవాడరూరల్ మండలంలోని తుర్కాషినగర్ గ్రామం ఫాజుల్‌నగర్ నుంచి దాదాపు 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామంలోని అత్యధికులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి కనీసం నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు. పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.

ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు



నేను ఏడేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాను. ఈ గ్రామంలో అందరూ నిరుపేద పిల్లలే. కానీ వీరికి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పాలకులకు, అధికారులకు చెప్పినా ఫలితం లేదు.

– సీహెచ్.మల్లేశం, హెచ్ఎం, తుర్కాషినగర్

నిధులు వచ్చాయి



తుర్కాషినగర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.3లక్షల నిధులు వచ్చాయి. వెంటనే పనులు ప్రారంభించి, సౌకర్యాలు కల్పిస్తాం.

– రాంరెడ్డి, ఎంపీడీవో, వేములవాడరూరల్

ఆ పాఠశాలలో ఆరుగురే విద్యార్థులు !

- ఇద్దరికి మించని హాజరు


ఇద్దరు విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు మల్లారెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా పరిధిలోని ధరంసోత్‌తండా పాఠశాలలో ఆరుగురే విద్యార్థులు చదువుతున్నారు. వీరికి విద్యాబోధనకు ఏకైక ఉపాధ్యాయుడు మల్లారెడ్డి ఉన్నారు. ఒకటో తరగతిలో ఒకరు, రెండో తరగతిలో ఇద్దరు, మూడో తరగతిలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఇక్కడ చదువుతున్నారు. నాలుగు, ఐదో తరగతిలో విద్యార్థులు లేరు. నిత్యం ముగ్గురు నుంచి నలుగురు విద్యార్థులు గైర్హాజరవుతుంటారు. వచ్చే ఇద్దరి.. ముగ్గురి విద్యార్థులకు సారూ పాఠాలు చెబుతున్నారు. అయితే సేవాలాల్‌తండా పరిధిలోని ధరంసోత్‌తండా, రాగంవాడ, సబ్‌స్టేషన్‌కాలనీ వాసులకు అందుబాటులో ఉండేందుకు ఇక్కడ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే పాఠశాలలో కనీసం 15 మంది చేరే అవకాశం ఉందని తండావాసులు పేర్కొంటున్నారు.



గ్రామదేవతలకు చలిబోనాలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో పోచమ్మ దేవతకు గురువారం చలిబోనాలు తీశారు. పిల్లాపాపలను సల్లంగ సూడాలని.. పాడిపంటలను కాపాడాలని కోరుతూ ఏటా గ్రామస్తులు గ్రామదేవతలకు, పోచమ్మతల్లికి చలిబోనాలు తీయడం ఆనవాయితీ. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ అనసూయ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

ఈ బైక్ రూపొందించిన జిల్లా యువకుడు

- అభినందించిన మంత్రి కేటీఆర్
- హైటెక్స్‌లో కొత్త బైక్ ప్రదర్శన

సిరిసిల్లటౌన్: ఎలక్ట్రిక్ వెహికల్ స్టార్టప్ కంపెనీకి చెందిన కొత్త మోడల్ ఏఆర్‌క్యూ ఈబైక్‌ను సిరిసిల్లకు చెందిన యువ ఇంజినీర్ పాక పరుశరామ్ రూపొందించారు. సదరు కొత్త మోడల్ బైక్‌ను హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గురువారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఏఆర్‌క్యూ అనేది బయోనిక్ డిజైన్, హెల్మెట్ బూట్ స్పేస్, స్వాప్ చేయగల బ్యాటరీ సిస్టమ్‌తో తయారీ చేసినట్లు తెలిపారు. పరుశురామ్‌ను మంత్రి కేటీఆర్ అభినందించారు.


పరుశురామ్ రూపొందించిన ఈబైక్


మంత్రి కేటీఆర్‌తో పరుశురామ్

పోలీసుల అదుపులో హత్య అనుమానితులు

- బంధువులపైనే అనుమానాలు
- విచారణ వేగవంతం చేసిన పోలీసులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలంలోని నర్సింగాపూర్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన రణవేణి గణేశ్ హత్య కేసులో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పాతకక్షలతో తన కుమారుడిని హతమార్చారని మృతుని తండ్రి చంద్రయ్య ఆరోపణలు చేశాడు. మృతుని భార్య స్వప్న, రణవేణి లావణ్య, రణవేణి భానుచందర్, సింగరవేణి బుచ్చవ్వ, సింగరవేణి హరీశ్, రణవేణి శరత్‌లపై పోలీసులకు మృతుడి తండ్రి ఫిర్యాదు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ముగ్గురు మహిళలను, రణవేణి భానుచందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారంలో ఉంది. గణేశ్‌ను హత్య చేసిందని మృతుని భార్య బంధువులను పోలీసులు ప్రాథమికంగా గుర్తించినప్పటికీ , గణేశ్‌కు ఇదే గ్రామానికి చెందిన రణవేణి భానుచందర్ మధ్య విభేదాలు ఉన్నట్లు మృతుని తండ్రి ఆరోపిస్తున్నారు. గతేడాది రుద్రంగి పెట్రోల్‌బంకు సమీపంలో భానుచందర్, గణేశ్‌పై దాడి చేశాడని ఫిర్యాదు చేశాడు. గతంలో ఇదే విషయమై రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ ఫిర్యాదుతో భానుచందర్‌పై కేసు నమోదైంది. కాగా ఈ హత్యకు ప్రధాన కారకుడు భానుచందరేనని చంద్రయ్య ఆరోపణలు చేయడంతో పోలీసులు ఆ కోణంలోనూ విచారణ చేసినట్లు తెలిసింది.

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం


రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం కొత్త బస్టాండ్ సమీపంలోని సంఘం స్థలంలో నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గుడ్ల రవిని సన్మానించారు. జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం 21 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర బాధ్యులు మానవాడ శంకర్, నీలి శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, ఆనందరావు, చిప్ప యాదగిరి, అనిల్‌కుమార్, తిరుపతిరెడ్డి, దుబ్బాక ప్రభాకర్, సుభాశ్ రెడ్డి, శ్రీనివాస్, సామల తిరుపతి, గుర్రం మల్లారెడ్డి పాల్గొన్నారు.

దర్గాను మూసివేయించండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 17 నుంచి జరిగే మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా దర్గాను మూసివేయించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కలెక్టర్ అనురాగ్ జయంతికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల్లో ఎక్కువ సంఖ్యలో కోడెమొక్కులు చెల్లించుకుంటారని.. ఆ సమయంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. రేగుల సంతోష్‌బాబు, సుదర్శన్‌యాదవ్, అన్నారం శ్రీనివాస్, రామతీర్థపు హరీశ్ ఉన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ మామిడాల సమ్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్వీయ రక్షణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆపద సమయంలో ధైర్యంగా ఎదుర్కొనే విధంగా సెల్ఫ్ డిఫెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.